క్లుప్తంగా

ముగిసిన ఏకాదశి ఉత్సవాలు


పూజలందుకున్న పోతులప్ప స్వామి మూలవిరాట్

కొత్తచెరువు: మండల వ్యాప్తంగా మూడు రోజులుగా కొనసాగుతున్న తొలి ఏకాదశి ఉత్సవాలు శుక్రవారం ముగిసాయి. ఇందులో భాగంగా భైరాపురం గ్రామంలో పోతులప్ప స్వామి, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లను తిప్పారు. రాత్రి గ్రామానికి చెందిన కురుబ కుళ్లాయప్ప తన కుమారుడు కురుబ కరుణాకర్ జ్ఞాపకార్థం నవరత్నాలు అనే నాటకాన్ని ప్రదర్శించారు.

తప్పిన ప్రమాదం


రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఐచర్ వాహనం

ముదిగుబ్బ: నాగలగుబ్బల సమీపంలో ఐచర్ వాహనం రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాలు.. ముదిగుబ్బ నుంచి పులివెందుల వైపు వెళ్తున్న ఐచర్ వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న వంకలోకి దూసుకెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదు.

కొనసాగిన న్యాయవాదుల దీక్ష


దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

కదిరి టౌన్: కదిరి న్యాయవాది రామస్వామి నాయుడుపై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని కోరుతూ స్థానిక కోర్టు సమీపంలో శుక్రవారం నాలుగో రోజూ న్యాయవాదులు దీక్ష కొనసాగించారు. నిందితులను అరెస్ట్ చేయాలని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని న్యాయవాదులు పేర్కొన్నారు. ఈసందర్భంగా ప్రజాసంఘాల నాయకులు న్యాయవాదులకు మద్దతు తెలిపారు.

రేపు గురుపౌర్ణమి వేడుకలు

తాడిమర్రి: స్థానిక షిర్డీసాయి బాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని బాబాకు ఉదయం 5.30 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. చిన్నారులతో చెక్క భజన, కీలు గుర్రాలు, మరగాళ్ల తదితర విన్యాసాలు చేస్తారని తెలిపారు. సాయంత్రం పల్లకీలో బాబా చిత్రపటాన్ని ఉంచి గ్రామంలో ఊరేగిస్తామని, ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదానం ఉంటుందని వివరించారు.

బీసీ హాస్టల్ తనిఖీ

ముదిగుబ్బ: ఎనుమలవారిపల్లిలోని బీసీ బాలుర హాస్టల్‌ను మండల స్పెషలాఫీసర్ శివకుమారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె హాస్టల్‌లో వసతులు, భోజనం తదితర వాటిపై విద్యార్థులతో ఆరా తీశారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆమె వెంట ఎంఈఓ రమణప్ప, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ ఉన్నారు.

కంపచెట్ల తొలగింపు


ఉప్పార్లపల్లి వద్ద కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

నల్లచెరువు: దేవిరెడ్డిపల్లి జాతీయ రహదారి నుంచి ఉప్పార్లపల్లి వరకూ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉప్పార్లపల్లి గ్రామస్తుల ద్వారా సమస్యను తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి రమణప్ప నాయుడు శుక్రవారం జేసీబీ సాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగింపజేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు పంచాయితీ కార్యదర్శిని అభినందించారు.

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

బత్తలపల్లి: రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లోని వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పాత బిల్డింగ్‌లు, పూరి గుడిసెల్లో ఉన్నవారు ఈ రెండు, మూడు రోజులు దగ్గరలో ఉన్నటువంటి ప్రభుత్వ భవనాలు, బంధువుల ఇంట్లోనూ ఉండాలని కోరారు. వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు వారి వారి గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ ఉండాలని ఆదేశించారు.


పరుగు పందెంలో దూసుకొస్తున్న ఎడ్లబండి

ఉరకలెత్తిన ఉత్సాహం


ఉట్టికొట్టేందుకు ఎగబడుతున్న యువకులు

పుట్టపర్తి అర్బన్: నిడిమామిడి గ్రామంలో శుక్రవారం జరిగిన ఉట్ల పరుష, ఎడ్లబండ్ల పరుగు పందెంలో ఉత్సాహం ఉరకలెత్తింది. గ్రామంలోని ప్రధాన రహదారిపై ఎడ్లబండ్ల పరుగు పందేలు నిర్వహించారు. పెనుకొండ, కొట్లపల్లి, పెడపల్లి, రాచువారిపల్లి, బుగ్గపల్లి, గాజులపల్లి తదితర 15 గ్రామాల నుంచి 80కి పైగా ఎడ్లబండ్లు వచ్చాయి. పరుగు పందెం పోటాపోటీగా సాగింది. ఇక కొత్తనిడిమామిడి లోని వీరభద్రస్వామి ఆలయం పక్కన ఉట్ల పరుష ఉత్సాహంగా సాగింది. సుమారు గంట పాటు ఉట్టికొట్టి కార్యక్రమంలో సుమారు 20 మంది యువకులు ఉట్టికొట్టిన అనంతరం ఉట్ల మాను ఎక్కారు. ఈ సందర్భంగా పలువురు యువకులు వివిధ వేషధరణలతో ఆకట్టుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా బొమ్మలు, తినుబండారాలు, ఆటవస్తువుల అంగళ్లు ఏర్పాటు చేశారు.

భూ సమస్యలు సత్వరం పరిష్కరించండి


మాట్లాడుతున్న ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ

తనకల్లు: మండలంలో నెలకొన్న భూ సమస్యలను సత్వరం పరిష్కరించాలని కదిరి ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సమస్యలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మట్లాడుతూ మార్పురివాండ్లపల్లి, ఎగువ తొట్లిపల్లి, టీ. సదుం గ్రామాలలో రైతుల మధ్య ఉన్న భూ వివాదాలను విచారించి, వెంటనే పరిష్కారం చూపాలని సూచించారు. అలాగే రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం తనకల్లు బాలిక ప్రభుత్వ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. వసతి గృహంలో వార్డెన్ విధులకు సక్రమంగా హాజరవుతున్నారా, మెనూ ప్రకారం భోజనాన్ని అందజేస్తున్నారా లేదా అని బాలికలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లోని మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శోభ సువర్ణమ్మ, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

'డయల్ యువర్ డీఎం'కు స్పందన


ఫోన్‌లో మాట్లాడుతున్న డీఎం ఇనయతుల్లా

పుట్టపర్తి టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో నిర్వహించిన శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమానికి స్పందన లభించింది. డీఎం ఇనయతుల్లా తన కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి 12.30 వరకు కార్యక్రమం నిర్వహించారు. పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నంకు చెందిన సాయి భక్తులు తిరుపతికి రాత్రి పూట సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేయాలని కోరారు. మరి కొంతమంది శ్రీశైలం సర్వీసు ఏర్పాటు చేయాలని, చెన్నై, పులివెందుల, కడప, గుంతకల్లు, కసాపురంతో పాటు గ్రామీణ ప్రాంతాలైన అమగొండం పాలెం, నార్శింపల్లి సర్వీసులు పునరుద్ధరించాలని విన్నించారు. కొత్తచెరువు, ముదిగుబ్బ కదిరికి బస్సులు రెగ్యులర్‌గా నడపాలని, కొత్తచెరువు -గోరంట్లకు సాయంత్రం 4.40 నుంచి 7.30 గంటల మధ్యలో ఒక సర్వీసు నడపాలని కోరారు. పుట్టపర్తి నుంచి అమరాపురానికి కొత్త సర్వీసు కావాలని కోరారు. ఉన్నతాధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని డీఎం తెలియజేశారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం


పరిశుభ్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి కుళ్లాయప్ప

నల్లమాడ: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించినట్లయితే రోగాలు దరిచేరవని శ్రీ సత్యసాయి జిల్లా మలేరియా, జిల్లా ప్రోగ్రాం అధికారి కేసీ కుళ్లాయప్ప నాయక్ సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రై డే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, వంట గది, నీటి ట్యాంకును పరిశీలించారు. కస్తూర్బా పాఠశాలలో పరిశుభ్రతపై విద్యార్థినులను ప్రశ్నించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను జిల్లా మలేరియా అధికారి తెలియజేశారు. హెచ్‌ఎం భాస్కర్ రెడ్డి, ఏఎంఓ లక్ష్మీనాయక్, సీహెచ్‌ఓ రామాంజులు, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్ర, దేవళానాయక్, సూపర్‌వైజర్ శశిధర్, పంచాయతీ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: మండలంలోని 10 గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం ఆయా సెక్రటరీలు, వైద్య సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. వాటర్ ట్యాంకుల శుభ్రం, వీధుల్లో నిలువ ఉన్న నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లడం, తొట్టిల్లో నీటిని పారబోయించడం, పిచ్చిమొక్కల తొలగింపు తదితర పనులు చేపట్టారు. సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

గాండ్లపెంట : కటారుపల్లి క్రాస్‌లోని కేజీబీవీని వైద్యాధికారిణి మారుతి సందర్శించారు. ఈసందర్భంగా ఆమె పాఠశాల తరగతి గదులతో పాటు వంట గది, మంచినీటి వసతి, కూరగాయలు, నిత్యావసర సరుకులు పరిశీలించారు. విద్యార్థులతో ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ఎస్‌ఓ దుర్గా, వైద్య సిబ్బంది విజయకుమార్. ఉపేంద్రారెడ్డి, రమాదేవి పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన ఉండాలి

పుట్టపర్తి అర్బన్: వ్యాధులపై ప్రజలకు అవగాహన ఉండాలని సీహెచ్‌ఓ నగేష్ పేర్కొన్నారు. శుక్రవారం బత్తలపల్లిలో కుష్టు వ్యాధి సర్వే, మాతా శిశు సంరక్షణ, సికిల్‌సెల్, అతిసార నియంత్రణ, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. సూక్ష్మక్రిముల ద్వారా కుష్టు సోకుతుందని పరిశుభ్రతతో పాటు ఇతరులు తగ్గినప్పుడు తుంపర్లకు దూరంగా ఉండాలన్నారు. రంగులేని మచ్చలు పాలిపోయినట్లున్నా, స్పర్శ కోల్పోయినా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మాతా శిశు సంరక్షణ, సికిల్ సెల్ వ్యాధిపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది సత్యమ్మ, ప్రవల్లిక, లక్ష్మీదేవి తదితరులు ఉన్నారు.

తపాలా పథకాలు సద్వినియోగం చేసుకోండి


బత్తలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బంది

బత్తలపల్లి: తపాలా శాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బత్తలపల్లి పోస్టుమాస్టర్ కమ్మన్న ప్రజలను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో పోస్టల్ డ్రైవ్‌లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుకన్య సమృద్ధి యోజన కింద 8.2 శాతం వడ్డీ వస్తుందన్నారు. పదేళ్లలోపు ఆడపిల్లలకు ఇది వర్తిస్తుందన్నారు. గ్రామీణ తపాలా జీవిత బీమా(ఆర్‌పీఎల్‌ఐ), ప్రభుత్వ ఉద్యోగులకు పీఎల్‌ఐ, ఆర్‌డీ(ఐదేళ్లు), టర్మ్ డిపాజిట్(టీడీ) అకౌంట్లు, పీపీఎఫ్, ఐపీపీబీ తదితర పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఓ బుడ్డన్న, ప్రకాష్, వెంకటనారాయణ, పోస్టల్ ఏజెంట్ నాయుడు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు


మాట్లాడుతున్న ఏఎస్‌ఐ తిరుపాలు

బత్తలపల్లి: మండల కేంద్రంలో ఐచర్ వాహనాల అసోసియేషన్ కార్యాలయాన్ని ఏఎస్ఐ తిరుపాల్ శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్టు రంగం బాధ్యతతో కూడుకుందన్నారు. వాహనాల యజమానులు, డ్రైవర్లు సమష్టిగా పని చేసినప్పుడే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. డ్రైవర్లు అందరూ తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపొద్దన్నారు. ట్రాన్స్‌పోర్టు బ్రోకర్లు జాంపుల చంద్రమోహన్, జాంపుల వెంకటేష్, బిల్లే శంకర్ మాట్లాడుతూ వాహనాలకు ఆల్ ఇండియా పర్మిట్ కల్గి ఉండాలని, మొదట స్థానికులకు అవకాశం కల్పిస్తామన్నారు. ఐచర్ వాహనాల అసోసియేషన్ మండలాధ్యక్షుడిగా పుల్లయ్య, ఉపాధ్యక్షుడిగా రమేష్, ట్రెజరర్‌గా సురేష్, సభ్యులుగా బగ్గిరి రామ్మోహన్‌రెడ్డి, మధుసూదన్‌నాయుడు, దివాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, కుంటాల రాము, శివశంకర్, రాము, మధు, వంశీ, లోకేష్, మల్కాపురం శ్రీనివాసులు, గంటాపురం పెద్దన్న, విజయ్, నరేంద్ర, నడిచెట్టి రమేష్, రాజులను ఎన్నుకున్నట్లు వివరించారు.

సమాజ సేవలో లయన్స్‌క్లబ్ ముందంజ


లయన్స్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: సమాజ సేవలో లయన్స్‌క్లబ్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు తెలిపారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో శుక్రవారం లయన్స్‌క్లబ్ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. క్లబ్ మాజీ గవర్నర్ రమేష్‌నాథ్‌రెడ్డి హాజరయ్యారు. సభాధ్యక్షులుగా గూడూరు మోహన్‌దాస్, పిట్టా వెంకటస్వామి వ్యవహరించారు. లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా వేణుగోపాలాచార్యులు, కార్యదర్శిగా ఆకులేటి రమేష్‌బాబు, కోశాధికారిగా ఉలవల నాగేంద్ర, ఉపాధ్యక్షుడిగా ప్రసాద్, మెంబర్‌షిప్ చైర్మన్‌గా వెంకటేష్‌కుమార్, అడ్మినిస్ట్రేటర్‌గా రాధాకృష్ణ, డైరెక్టర్లుగా పల్లెం వేణుగోపాల్, బండి వేణుగోపాల్, పిట్టా వెంకటస్వామి, గోసే రాధాకృష్ణ, మెటికల కుళ్లాయప్ప, గూడూరు రాజగోపాల్, శాగా సురేష్, ఉట్టి శివప్రసాద్, ఎం.క్రిష్ణ ప్రమాణం చేశారు.

వీరాస్వామికి ఐకాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు



కదిరి అర్బన్: కదిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ లెక్చరర్‌గా పని చేస్తున్న వేముల వీరాస్వామి ఐకాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఏటా దేశంలో వివిధ రంగాల్లో అసాధారణ ప్రతిభావంతులను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేస్తామని రిఫాసిమెంటో ఇంటర్నేషనల్(న్యూ ఢిల్లీ సంస్థ) ఎడిటర్ రవిభూషణ్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది వేముల వీరాస్వామికి అవార్డు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కదిరి అర్బన్: ఎరుకులవాండ్లపల్లి హరీష్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి 46వ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఎస్ కిరణ్ శనివారం తెలిపారు. ఈ నెల 17న కదిరిలో జరిగిన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ క్రీడా పోటీల్లో తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న చరణ్‌కుమార్‌రెడ్డి, 9వ తరగతి చదువుతున్న సింధూ, జాహ్నవి, దేవిక, షాలినీ, 8వ తరగతి చదివే శైలజ జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. వీరంతా ఆగస్టు 16, 17 తేదీల్లో కదిరి ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

సర్టిఫికెట్ల తనిఖీ వేగవంతం చేయండి


మాట్లాడుతున్న తహసీల్దార్ శివశంకర్‌నాయక్

బత్తలపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది చేపట్టిన క్యాస్ట్ సర్టిఫికెట్(కుల ధ్రువీకరణ పత్రం) తనిఖీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. వీఆర్‌ఓలు చేస్తున్న సుమోటో ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ సంబంధించి క్యాస్ట్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఓలు ఈ ప్రక్రియను చాలా జాగ్రత్తగా చేయాలన్నారు. ఈ ప్రక్రియలోనే ప్రజల నుంచి అందే వినతులను స్వీకరించి మార్పులు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు మండలంలో 86 శాతం మాత్రమే వెరిఫికేషన్ పూర్తయిందన్నారు. సీసీఆర్‌సీ(కౌలు రైతు కార్డులు) 45 మందికి గాను 22 మందికి మాత్రమే ఇచ్చామన్నారు. మిగిలిన వాటిపైన విచారణ పూర్తి చేయాలన్నారు. రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు సకాలంలో అందజేయాలన్నారు. లేట్ బర్త్, డెత్ సర్టిఫికెట్లు సమగ్రంగా విచారించి గడువులోగా కార్యాలయానికి అందజేయాలన్నారు. ఇసుక రీచ్‌లో నిబంధనల మేరకు ప్రజలకు ఇసుక అందజేయాలన్నారు. సర్వే డిప్యూటీ తహసీల్దార్ సునీత, కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కళాశాల నిధులపై విచారణ చేయాలి


కళాశాల ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థిసంఘాల నాయకులు

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిధులపై సమగ్ర విచారణ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్‌ఐ, ఆర్‌ఎస్‌వైఎఫ్ నాయకులు నరసింహ, ఉపేంద్రతో పాటు పలువురు విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఐదేళ్లగా కళాశాలలో తరగతి గదుల్లో మరమ్మతు పనులు చేయకుండా గాలికొదిలేశారన్నారు. గతంలో నేమ్‌బోర్డు, ముఖద్వారం, బిల్డింగ్ మెయింటెన్స్ చేయకుండా నిర్లక్ష్యం వహించారని పేర్కొన్నారు. నిధులు లేవని చెప్పి మొన్నటికిమొన్న 15 ఏసీలు ఎలా ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. విద్యార్థి సంఘం నాయకులకు కళాశాలలోకి రానీయొద్దని ప్రిన్సిపాల్ చెప్పడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కళాశాల నిధులపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పృథ్వీరాజ్, అవినాష్, జన, భార్గవ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్కమహాదేవతల ఉత్సవాలు ప్రారంభం


ఎలువ గంపలు ఎత్తుకెళ్తున్న సుబ్బరాయనిపల్లి పూజారులు

పుట్టపర్తి అర్బన్: సుబ్బరాయనిపల్లి సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో శుక్రవారం అక్క మహాదేవతల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముద్దల వంశీయులు శుక్రవారం ఎలువగంప ఉత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలోని పురాతన ఆలయం నుంచి అమ్మవారికి అలంకరణకు వినియోగించే ఆభరణాలు, పసుపు కుంకుమ, పూలమాలలతో ఏర్పాటు చేసిన ఎలువ గంపలను ఎత్తుకెళ్లి అక్కడే రెండు రోజుల పాటు జాగరణతోపాటు పూజలు నిర్వహిస్తారు.

రేపు ఎడ్లబండ్ల పరుగు పందెం

ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఎడ్లబండ్ల పరుగు పందేలు, కన్నె పిల్లల చేత కుంకుమార్చన, ప్రత్యేక పూజలు ఉంటాయి. ఉత్సవాలకు జిల్లా నలు మూలల నుంచే గాక కర్ణాటక నుంచి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేస్తారు.

ముద్దచర్మ వ్యాధి టీకాలు వేయించండి

ఓడీచెరువు: పశు యజమానులు తమ పశువులకు ముద్దచర్మ వ్యాధి నివారణ టీకా వేయించుకోవాలని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ కోరారు. శుక్రవారం పశువులకు ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండల వ్యాప్తంగా ఎల్ఎస్‌డీ వ్యాక్సినేషన్ జరుగుతోందన్నారు. ఈ వాధ్యి కారణంగా పశువులకు శరీరమంతా దద్దుర్లువచ్చి జ్వరం, బలహీనత కారణంగా పాల దిగుబడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఓడీచెరువు, కొండకమర్ల పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.


గొట్లూరులో జలధికి వెళుతున్న పీర్లు


కనగానపల్లి మండలం మామిళ్లపల్లిలో పీర్లను దర్శించుకుంటున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో జలధి

ధర్మవరం రూరల్: గొట్లూరు గ్రామంలో మొహర్రంలో భాగంగా శుక్రవారం జలధి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్లను అందంగా అలంకరించి ముల్లా సాబ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం నుంచి గ్రామంలో పీర్లను ఊరేగించారు. ఈ సందర్భంగా పీర్లకు గ్రామస్తులు చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొలువుదీరిన ఉరుసు పీర్లు

తలుపుల : మండలంలోని బండ్లపల్లి, టి.రెడ్డివారిపల్లి గ్రామాల్లో ఉరుసు పీర్లను శుక్రవారం కొలువుదీరాయి. టి.రెడ్డివారిపల్లిలో ఉరుసు పీరును నిగ్గిడి వంక నుంచి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని రామాయలం పక్కన కొలువుదీర్చారు. బండ్లపల్లిలో రామాలయం పక్కన ఉరుసు పీరును కొలువుదీర్చి ప్రార్థనలు నిర్వహించారు.

ముగిసిన మొహర్రం

కనగానపల్లి: మామిళ్లపల్లిలో శుక్రవారం జలధి కార్యక్రమం నిర్వహించారు. వేకువజామునే పీర్ల స్వాములను గ్రామంలోని వీధుల్లో ఊరేగించారు. ఇక సాయంత్రం జరిగిన జలధి కార్యక్రమాన్ని తిలకించేందుకు స్థానిక గ్రామస్తులతో పాటు చుట్టు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా యువకులు, పిల్లలు డప్పుల శబ్దాలకు అలావ్ తొక్కుతూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం పీర్లస్వాములను అగ్నిగుండ ప్రవేశం చేయించి భక్త జనసందోహం మధ్య జలధికి తరలించారు. .